మాజీ సైనికుల సంక్షేమంపై
నిర్వహణ కమిటీ సమావేశం

అమరావతి,ఆంధ్రప్రభ: మాజీ సైనికుల సంక్షేమం, పునరావాసం కోసం ప్రత్యేక నిధులతో చేపట్టాల్సిన అంశాలపై గురువారం రాజ్‌భవన్‌లో రాష్ట్ర నిర్వహణ కమిటీ ఛైర్మన్, గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ వీ వెంకట రెడ్డి ప్రత్యేక నిధితో అమలు చేసిన, చేయనున్న కార్యక్రమాలను నిర్వహణ కమిటీ సభ్యులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వివిధ జిల్లాల్లో సమీకృత సైనిక భవనాలు, యుద్ధ స్మారక చిహ్నాలు, కమ్యూనిటీ సెంటర్ల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు సమావేశం ముందు పెట్టారు. సమావేశంలో ఆయా అంశాలను చర్చించి తగిన నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎస్ఎస్ రావత్, మేజర్ జనరల్ అజయ్ మిశ్రా, హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్, గవర్నర్ ఎక్స్ అఫిషియో కార్యదర్శి డాక్టర్ ఎం.హరి జవహర్ లాల్, కేంద్రీయ సైనిక బోర్డు(న్యూఢిల్లీ) కార్యదర్శి బ్రిగేడియర్ దిగ్విజయ్ సింగ్ బసేరా, ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి ఏ.గౌతమ్, హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి జీ.విజయ్ కుమార్, లెఫ్టినెంట్ జనరల్ కేజీ కృష్ణ, ఏవీఎం షేక్ మహబూబ్ సుభాని, కేఆర్‌కే మూర్తి, కల్నల్ రాంప్రకాష్, కెప్టెన్ ఎం.శ్రీబాలాజీ, గవర్నర్ సంయుక్త కార్యదర్శి పీఎస్ సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వీసీల ఎంపికకు సెర్చ్ కమిటీలు

అమరావతి,ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని 4 విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్సర్లను ఎంపిక చేయడం కోసం సెర్చ్ కమిటీలు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (గుంటూరు), శ్రీకృష్ణదేవరాయ (అనంతపురం), జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ (విజయనగరం), ద్రవిడియన్ యూనివర్సిటీ (కుప్పం) వీసీ పోస్టులకు సంబంధించి ఒక్కో విశ్వవిద్యాలయానికి ఒక్కో కమిటీ ఏర్పాటు కానున్నాయి. ఈ కమిటీలు త్వరలోనే సమావేశమై విశ్వ విద్యాలయానికి అనువైన మూడు పేర్లను సూచించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఏపీ జేఏసీ ఛైర్మన్‌గా విద్యాసాగర్

అమరావతి,ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ జాయింట్ యాక్షన్ కమిటీ నూతన ఛైర్మన్‌గా ఏపీ ఎన్జీవోస్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏ.విద్యాసాగర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఎన్‌జీవో సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి డివి రమణ డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా ఎన్నికయ్యారు. విజయవాడలో గురువారం జరిగిన ఉద్యోగ సంఘాల సంయుక్త సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు ఐక్య కార్యాచరణ సమితి తదితర అన్ని ఉద్యోగ సంఘాలు నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఉద్యోగ సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, ఏపీఎస్ఆర్‌టిసి, పెన్షనర్లు,గ్రామ వార్డు సచివాలయం, సిపిఎస్ రాష్ట్రనాయకులంతా పాల్గొని, విద్యాసాగర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విద్యాసాగర్ గత 30 ఏళ్లుగా ఎన్‌జీవో సంఘంలో సీనియర్ నాయకుడిగా ఉంటూ, ఉద్యమనేతగా ముందుండి అనేక ఉద్యమాలను నడిపించారు. ఉద్యోగ, సామాజిక అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉన్న ఆయన ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ముందుంటారని ఆయా సంఘాల నేతలు పేర్కొన్నారు.

డానిష్ ఫైబర్ టెక్నాలజీతో
రోడ్లపై వినూత్న ప్రయోగం

- రాష్ట్రంలో ఈ సాంకేతికతను ఉపయోగించడం ఇదే మొదటిసారి
- పైలట్ ప్రాజెక్టుగా బనగానెపల్లె ఎంపిక

అమరావతి,ఆంధ్రప్రభ: గత ఐదేళ్లలో గుంతలు, గోతులతో ఉన్న రోడ్లపై ప్రయాణించాలంటేనే ప్రజలకు నరకప్రాయంగా ఉండేది. సరకు రవాణా చేయాలన్నా రోడ్లపై గుంతలు కారణంగా టైర్లు, ఇతర బాగాలు దెబ్బతిని లారీలే మూలకు వెళ్లాయి. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఈ రహదారుల్లో అనూహ్య మార్పులు సంతరించుకుంటున్నాయి. దేశంలోనే మెరుగైన రహదారుల కల్పనకు ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో మెరుగైన విధానాలను అవలంభిస్తున్నారు. ఇప్పటికే ఈ శాఖ గుంతల రోడ్ల పనులను సకాలంలో పూర్తి చేసి, ప్రజల మన్ననలు పొందడంలో విజయం సాధించింది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన, సుస్థిరమైన, సుదీర్ఘకాలం పాటు నిలిచే రహదారులే లక్ష్యంగా ప్రపంచస్థాయి ప్రమాణాలతో డానిష్ ఆస్ఫాల్ట్ ఫైబర్ సాంకేతికతను ప్రవేశపెట్టనున్నారు.

కాగా మొదట ప్రయోగాత్మకంగా ఈ డానిష్ ఫైబర్ విధానంలో పైలెట్ ప్రాజెక్టులో భాగంగా నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గంలో ముదిగేడు - సంజామల మధ్య 2 వరుసల రహదారిని నిర్మిం చనున్నారు. ఈ ప్రాజెక్టు విజయం సాధిస్తే భవిష్యత్తులో రాష్ట్రంలోనే కాదు, దేశ వ్యాప్తంగా రహదారులకు కూడా ఈ టెక్నాలజీలో ఆంధ్రప్రదేశ్ మార్గదర్శకంగా నిల వనుంది. ఇది రాష్ట్రంలో రహదారుల నిర్మాణంలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని చెప్పడంలో సందేహం లేదు.

ఈ సాంకేతికతతో రోడ్లపై 100 శాతం గుంతలు నివారించొచ్చు..

ప్రపంచ వ్యాప్తంగా రోడ్ల అభివృద్ధిలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకుంటూ నేడు డానిష్ ఆస్ఫాల్ట్ రీ-ఇన్ఫోర్సింగ్ ఫైబర్ టెక్నాలజీతో పైలట్ ప్రాజెక్ట్ ను ప్రారంభించడం మన రాష్ట్రానికే గర్వకారణం... డెన్మార్క్‌కు చెందిన ఈ ఆధునాతన టెక్నాలజీని.. ప్రపంచ ప్రఖ్యాతి గడించిన హీత్రో ఎయిర్‌పోర్ట్ (యూకే), దుబాయ్ మెట్రో, ఏ7 మోటార్‌వే (జర్మనీ) లాంటి ప్రాజెక్టుల్లో ఇప్పటికే విజయవంతంగా ఉపయోగించారు. ఐబీక్యూ జర్మనీ, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్ వంటి దేశాల్లో ఈ సాంకేతికను విజయవంతంగా ఉపయోగించారు. ఈ టెక్నాలజీ ద్వారా అరమిడ్, పాలియోలెఫిన్ అనే అధిక బలం కలిగిన ఫైబర్లు ఆస్ఫాల్ట్ మిశ్రమంలో కలుపుతారు. వీటి వల్ల సాధారణంగా రహదారులపై పడే గుంతలు - గోతులు, రోడ్లపై చీలికలు వంటి ధీర్ఘకాలిక సమస్యలకు చెక్ పెట్టే అవకాశం ఉంది. తారు రోడ్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ అధునాతన విధానం కొత్త, పాత తారు రోడ్ల నిర్మాణంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా ఈ టెక్నాలజీ ద్వారా తారు రోడ్లపై 100శాతం గుంతలను నివారించవచ్చు. సాంప్రదాయ తారు కంటే ఈ ఫైబర్ కలిపిన తారు చాలా బలంగా ఉంటుంది. ముఖ్యంగా రోడ్లపై పగుళ్లు, చీలికలు, ప్రకృతి వైపరిత్యాలు వంటి కఠిన వాతావరణ పరిస్థితులను తట్టుకుని ధీర్ఘకాలం పాటు పనిచేస్తోంది.

50 శాతం పెరగనున్న రహదారుల జీవితకాలం..

అధిక వాహనాలతో నిరంతరం రద్దీగా ఉండే రోడ్లపై అధిక ఒత్తిడి పడకుండా ఈ టెక్నాలజీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ టెక్నాలజీ ద్వారా రోడ్ల నాణ్యతా ప్రమాణాలు పెరిగడంతో పాటు, రహదారుల జీవితకాలం కూడా 50శాతం పైగా పెరగనుంది. ఈ అధునాతన టెక్నాలజీని అందిపుచ్చుకోవడం ద్వారా రోడ్ల మరమ్మతులకు చెక్ పెడితే, నిరంతరాయంగా గుంతలు లేని రహదారులపై సాఫీగా, వేగంగా ప్రయాణించే వెసులుబాటు ఉంటుంది. అది పరోక్షంగా ట్రాఫిక్ సమస్యలకు చాలా మేరకు తగ్గిస్తోంది. హెవీ లోడ్ లతో కూడిన రవాణా వాహనాలు రహదారులపై వెళుతున్నక్రమంలో సాధారణంగా ఆయా రోడ్లపై ఒకే ప్రాంతంలో ఒక్కసారిగా అధిక భారం పడి, అది అంతిమంగా రోడ్లు కుంగిపోవడం, గుంతలు పడి పాడైపోవడం, పగుళ్లురావడం వంటివి జరుగుతాయి.. కానీ అదే ఈ డానిష్ ఫైబర్ టెక్నాలజీ రోడ్లలో ఉన్న ఫైబర్... హెవీ లోడ్స్, కంటెనర్ల వంటి భారీ వాహనాల భారాన్ని అన్ని వైపుల నుంచి (త్రిడైమన్షనల్‌గా) ఎదుర్కొవడం వల్ల రోడ్లపై ఆయా ప్రాంతాల్లో ఏకకాలంలో ఒకచోటే ఎక్కువ భారం పడకుండా ఈ టెక్నాలజీ అడ్డుకుంటుంది.. తద్వారా ఈ రోడ్లపై ఒత్తిడి తగ్గి, ఎక్కువ కాలం మన్నికకు కారణమవుతోంది. ఈ టెక్నాలజీని ఉపయోగించడం ద్వారా ప్రభుత్వాలపై మరమ్మతుల భారం తగ్గడం ద్వారా పరోక్షంగా నిర్వహణ ఖర్చు కూడా భారీగా తగ్గుతుంది.. కొత్త యంత్రాలు అవసరం లేకుండానే ఈ టెక్నాలజీ ఉపయోగించుకునే అవకాశం ఉండటం.. ఈ రోడ్లపై వాడే డానిష్ ఫైబర్ తిరిగి వినియోగించుకునే వీలు ఉన్న నేపథ్యంలో ఇది పర్యావరణ పరంగా చూసుకున్న చాలా అనుకూలమైనది.



జగన్ భద్రతపై వైసీపీ నేతల పిటిషన్‌పై
విచారణ 9కి వాయిదా

అమరావతి,ఆంధ్రప్రభ: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ప్రభుత్వం ప్రస్తుతం జడ్ ప్లస్ హోదా భద్రత కల్పిస్తున్నదని, పిటిషనర్లు దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌లో జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉన్న వ్యక్తులకు రక్షణ కల్పించే విషయంలో కేంద్ర హోంశాఖ జారీ చేసిన మార్గదర్శకాలకు సంబంధించి మరింత వివరంగా కౌంటర్ దాఖలు చేస్తామని అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ గురువారం హైకోర్టుకు నివేదించారు. జగన్ నెల్లూరు పర్యటన సందర్భంగా సెయింట్ ఆన్స్ పాఠశాలలో తాత్కాలిక హెలీ ప్యాడ్ ఏర్పాటు చేసుకొనేందుకు అనుమతించేలా జిల్లా కలెక్టర్‌ను ఆదేశించాలంటూ ఆ పార్టీ నేతలు దాఖలు చేసిన పిటిషన్ పర్యటన వాయిదా నేపథ్యంలో నిరర్థకమైందన్నారు. నెల్లూరు పర్యటన సందర్భంగా తాత్కాలిక హెలీప్యాడ్ ఏర్పాటుకు అనుమతించేలా జిల్లా కలెక్టర్‌ను ఆదేశించాలని కోరుతూ వైసీపీ నేతలు లేళ్ల అప్పిరెడ్డి, ఆ పార్టీ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం విచారణ జరిపిన హైకోర్టు జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉన్న వ్యక్తులకు రక్షణ కల్పించే విషయంలో కేంద్ర హోంశాఖ జారీ చేసిన మార్గదర్శకాలను తమ ముందు ఉంచాలని పిటిషనర్లను ఆదేశిం చిన విషయం తెలిసిందే. కాగా ఆయా పిటిషన్లపై గురువారం మరోసారి విచారణ సదర్భంగా సీనియర్ న్యాయవాది ఎస్ శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ హెలిప్యాడ్‌కు సంబంధించి అనుమతులు ఆలస్యంగా ఇచ్చినందున పర్యటన రద్దయిందని, కేంద్ర మార్గదర్శకాల ప్రకారం జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉన్న వ్యకికి రోప్ పార్టీ ఏర్పాటు చేయకుంటే జగన్ రక్షణకు ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ఏజీ వాదనలు వినిపిస్తూ మాజీ సీఎం జగన్ తన భద్రతకు సంబంధించి దాఖలు చేసిన పిటిషన్‌లో పొందలేని ఉత్తర్వులు ఆ పార్టీ నేతల దాఖలు చేసిన పిటిషన్ ద్వారా పొందేందుకు ప్రయత్నిస్తున్నారని విచారణ వాయిదా వేయాలని కోరారు. వాదనల అనంతరం తదుపరి విచారణను న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్ ఈనెల 9కి వాయిదా వేశారు.

ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మి పిటిషన్ విచారణ వాయిదా

హైదరాబాద్,ఆంధ్రప్రభబ్యూరో: ఓఎంసీ కేసులో ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మి తెలంగాణ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం విచారణ చేపట్టారు. ఈక్రమం లో ఓఎంసీకి తాను అనుమతివ్వలేదని శ్రీలక్ష్మి తరపున వాదనలు వినిపించారు.

విశాఖలో త్వరలోనే
టూరిజం యూనివర్సిటీ

- డబుల్ డెక్కర్ టూర్‌లో రుషికొండ ప్యాలెస్‌ను చేర్చుతాం
- మంత్రి కందుల దుర్గేష్

విశాఖపట్నం,ఆంధ్రప్రభ: పర్యాటక రాజధానిగా అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరంలో త్వరలోనే టూరిజం యూనివర్శిటీని ఏర్పాటు చేయనున్నామని, దీంతో నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. గురువారం సన్ క్యాంపస్ లో ప్రత్యేకంగా పర్యాటకరంగా అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను - విధి విధానాలు- విద్యార్థినీ, విద్యార్థుల ప్రతిభను ప్రత్యేకంగా పరిశీలించి, విద్యార్థులతో టూరిజం రంగంలో ఉపాధి అవకాశాలు ఎటువంటి లాభాలు అంశంపై ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. త్వరలోనే పర్యాటక రంగ యూనివర్సిటీ సైతం విశాఖలో నెలకొల్పునందుకు చర్యలు తీసుకున్నట్లు తెలియజేశారు. ప్రధాని మోడీ సైతం విశాఖకు ప్రత్యేక స్థానం కల్పించారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సైతం విశాఖపట్నం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిని పెట్టారన్నారు. ప్రస్తుతం పర్యాటక రంగంలో అనేక అవకాశాలతో పాటు ఉపాధి అవకాశాలు ఎన్నో ఉన్నాయన్నారు. జీవితంలో విద్యార్థులు సరైన నిర్ణయాన్ని తీసుకునేది కళాశాల సమయంలోనే కనుక తమ లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో వెనక్కు వదలవద్దన్నారు. మాజీ మంత్రి, భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా పర్యాటక రంగానికి ఎంతో పేరు ఉందన్నారు. ప్రస్తుతం విద్యార్థులు తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకుంటున్నారని అందులో పర్యాటక రంగం వైపు వచ్చేందుకు అమితంగా ఇష్టపడుతున్నారన్నారు .ప్రముఖ పర్యాటక ప్రాంతమైన భీమిలిలో సైతం టూరిజం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

బ్లూ ఫ్లాగ్ హోదాకు డోకా లేదు

రుషికొండ బీచ్ బ్లూ ఫ్లాగ్ స్థాయి ప్రమాణాలను కొనసాగించడంతో పాటు మరింత సుందరంగా తీర్చిదిద్దుతామని మంత్రి దుర్గేష్ అన్నారు. గురువారం రుషికొండ బీచ్ లో సౌకర్యాలను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో కలసి పరిశీలించిన అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ, అంతర్జాతీయ ప్రమాణాలతో రుషికొండ బీచ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. సముద్రంలోకి కొట్టుకు వస్తున్న చెత్తను ఏ రోజుకా రోజు శుభ్రం చేస్తున్నామని, పాడైపోయిన కంటైనర్.. షెడ్లు.. కొత్తవాటితో మార్పు చేస్తామన్నారు. శుభ్రత, సుందరీకరణ, సౌకర్యాలు, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. ఈవీ డబుల్ డెక్కర్ బస్సును ఈనెలలోనే విశాఖలో ప్రారంభించనున్నామని, ఈ టూర్‌లో రుషికొండ ప్యాలెస్‌ను కూడా భాగం చేయాలనే ఆలోచన ఉందన్నారు. ఐటీ, రియల్ ఎస్టేట్, సహాటూరిజం అభివృద్ధికి విశాఖలో పెద్ద ఎత్తున అవకాశాలున్నాయని చెప్పారు. అంతకుముందు రుషికొండ బీచ్ లో వసతులను మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే గంటా, జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పరిశీలించారు. సాగర్ నగర్ దగ్గర డబుల్ డెక్కర్ బస్సు ఈవీ చార్జింగ్ పాయింట్ ను ప్రారంభించి, బస్సులో సౌకర్యాలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జనసేన భీమిలి ఇంచార్జ్ పంచకర్ల సందీప్, శాఖారి శ్రీనివాస్, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ రీజనల్ డైరక్టర్ జగదీష్, అసిస్టెంట్ మేనేజర్ బసంత్, జిల్లా టూరిజం ఆఫీసర్ మాధవి, కార్పొరేటర్ లొడగల అప్పారావు, పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లపై వైసీపీ అప్పులు...
మాకు బ్యాంకు నోటీసులు

ప్రజావేదికలో వాపోయిన లబ్ధిదారులు

అమరావతి,ఆంధ్రప్రభ: టీడీపీ ప్రజా వేదికకు భూ, ఇతర సమస్యలపై జనం తరలివచ్చారు.గురువారం ప్రజా వేదికలో భాగంగా టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్, వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మరెడ్డి శ్రీనివాసరెడ్డి వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేశారు.గత టీడీపీ ప్రభుత్వంలో టిడ్కో ఇళ్లకోసం దరఖాస్తు చేసుకోగా జక్కంపూడి టిడ్కో లో ఇళ్లు మంజూరు అయ్యాయని,అయితే తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ ఇళ్లపై సప్తగిరి బ్యాంక్ లో లోన్ తీసుకొని తమకు ఇళ్లను ఇవ్వలేదని నేడు ఆ బ్యాంకు నుండి నోటీసులు వస్తున్నాయని విజయవాడకు చెందిన బాధితులు వాపోయారు. ఆ నోటీసులు ఎందుకు వస్తున్నాయో తమకు తెలియడం లేదని,దయచేసి తమ సమస్యను పరిష్కరించాలని టీడీపీ నేతలను కోరారు. అన్నమయ్య జిల్లా మదనపల్లికి చెందిన పీట్ల చిన్నయ్య తన భూమిని వైసీపీ చెందిన వారు కబ్జా చేయాలని చూస్తున్నారని,వారికి అధికారులు కూడా సహరిస్తూ తమను ఇబ్బంది పెడు తున్నారని ఆరోపించారు.తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు. తిరుపతిలో స్థానికంగా నివాసం ఉంట తిరుమలలో వివిధ వ్యాపార సముదాయాలకు, హోటళ్లకు తాము పూలను సరఫరాచేస్తూ జీవనం సాగించేవాళ్లమని అయితే గత కొంత కాలంగా అలిపిరి టోల్గేట్ వద్ద విజిలెన్స్ వారు తమ పూలను పైకి వెళ్లనివ్వకుండా అనుమతి నిరాకరిస్తున్నారని,దాంతో తమ జీవనోపాధికి ఇబ్బందిగా మారుతుందని,దయచేసి సమస్యను పరిష్కరించాలని తిరుపతి పూలవీధికి చెందిన పలువురు మహిళలు గ్రీవెన్స్ లో అర్జీఇచ్చి అభ్యర్థించారు. ఏలూరు జిల్లా నూజివీడు మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన పొట్లూరి పద్మజారాణి కబ్జాదారులు తన భూమిని కబ్జా చేసి తనను చంపుతామని బెదిరిస్తున్నారని,తనను బెదిరిస్తున్న సత్యనారాయణ, రామాంజనేయులపై చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు.తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం పాకవారి పల్లి గ్రామానికి చెందిన టి.

విజయమ్మ తన ఇంటి స్థలాన్ని ఆక్రమించుకొని ఇల్లు నిర్మించుకోవడమే కాకుండా,అక్రమ రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారని,దయ చేసి జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్ ను రద్దు చేసి తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. గుంటూరుకు చెందిన దర్శి ఝాన్సీ కొండమంజులూరు గ్రామంలో తన తల్లిగారిపేరుమీద ఉన్న భూమిని శరత్ చంద్రమౌళి అనే వ్యక్తి ఆక్రమించి తమపై గొడవలకు వస్తున్నాడని అతనిపై చర్యలు తీసుకొని తమ భూ సమస్యను పరిష్కరించాలని కోరారు.

డీఎస్సీ ప్రాథమిక 'కీ'లు విడుదల

అమరావతి, ఆంధ్రప్రభ: మెగా డీఎస్సీలో భాగంగా జూన్ 6-28 వరకు జరిగిన వివిధ పరీక్షలకు సంబంధించి ప్రాథమిక కీ, రెస్పాన్స్ షీట్లను గురువారం నుంచి మెగా డీఎస్సీ వెబ్ సైట్లో అందుబాటులో ఉంచుతునట్లు మెగా డీఎస్సీ కన్వీనర్ ఎం.వి.కృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ విభాగంలో కామర్స్, ఇంగ్లీష్, హిందీ, ఫిజికల్ సైన్స్, సంస్కృతం, సోషల్, తెలుగు.. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో ఇంగ్లీష్, ఫిజికల్ సైన్స్.. ఎస్జీటీ విభా గంలో ఎస్జీటీ జనరల్, ఎస్‌జీటీ - స్పెషల్ హెచ్‌హెచ్ (వినికిడి లోపం ఉన్నవారికి), ఎస్‌జీటీ - స్పెషల్ వీహెచ్ (దృష్టి లోపం ఉన్నవారికి ప్రత్యేక ఎస్‌జీటీ)..టీజీటీ విభా గంలో ఇంగ్లీష్, హిందీ, ఫిజికల్‌సైన్స్, సైన్స్, సోషల్, తెలుగు.. ఇంగ్లీష్ ప్రావీణ్యత పరీక్ష, పీఈటీ - హెచ్‌హెచ్ (వినికిడి లోపం ఉన్నవారికి), పీఈటీ - వీహెచ్ (దృష్టి లోపం ఉన్నవారికి) - ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పరీక్షలకు సంబంధించి అన్ని మాధ్యమాల కీ, రెస్పాన్స్ షీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అభ్యర్థులు తమ వ్యక్తిగత రెస్పాన్స్ షీట్లను పరిశీలించి, ప్రాథమిక కీపై అభ్యంతరాలు ఉంటే వాటిని సంబంధిత ఆధారాలతో జూలై 11 లోపు అధికారిక వెబ్సైట్ ద్వారా మాత్రమే సమ ర్పించాలని తెలిపారు. జూన్ 29-జూలై 2 వరకు జరిగే పరీక్షల ప్రాథమిక కీ, రెస్పాన్స్ షీట్లు కూడా త్వరలో విడుదల చేస్తామమని కృష్ణారెడ్డి తెలిపారు.

పకడ్బందీగా వెబ్ ల్యాండ్ నమోదు

రాష్ట్ర వ్యవసాయశాఖ సంచాలకుడు ఢిల్లీరావు

అమరావతి,ఆంధ్రప్రభ: అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకానికి సంబంధించి వెబ్ ల్యాండ్ నమోదులో ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా జాగ్రత్తలు వహించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ సంచాలకుడు ఎస్.ఢిల్లీరావు తెలిపారు. ఈ మేరకు మీడియాకు ప్రకటన విడుదల చేశారు. రెవెన్యూ అంశాలపై క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారులు పూర్తిస్థాయి అవగాహన ఏర్పర్చుకోవాలన్నారు. ఈ మేరకు రెవెన్యూ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలన్నారు. మున్సిపాల్టీలలో విలీనం కావటం వల్ల వెబ్ ల్యాండ్ లో కనబడని గ్రామాలు, ఎస్టేట్, ఇనామ్ భూముల రద్దు చట్టం పరిధిలోని గ్రామాలు, సొసైటీ భూముల నోషనల్ ఖాతాలు తదితర అంశాలపై వెబ్ ల్యాండ్ లో ఏర్పడున్న సాంకేతిక అవరోధాలపై అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికపుడు పరిష్కరించాలన్నారు. ఈ మేరకు అన్నదాత సుఖీభవ పథకం గ్రీవెన్స్ మాడ్యుల్ తో పాటు ఫిర్యాదుల విభాగాన్ని ఈ నెల 4 శుక్రవారం ప్రారంభించనున్నట్టు తెలిపారు. సాంకేతిక సమస్యల్నటినీ అధిగమించి నూటికి నూరుశాతం సమగ్ర వివరాలతో వెబ్ ల్యాండ్ నమోదు ప్రక్రియను పూర్తి చేసేందుకు వ్యవసాయాధికారులు ప్రత్యేక శ్రద్ద కనబర్చాలని కోరారు.

దక్షిణ మధ్య రైల్వే
మమ్మల్ని అనుసరించండి @SCRailwayIndia
డ.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల యొక్క వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.

టెండరు ప్రకటన నెం.: జి/ఇ.29/ టిఆర్/ టెండరు ప్రకటన / 15/2025-26 తేది: 02.07.2025 PUB/0803

భారత రాష్ట్రపతి తరపున మరియు కొరకు వ్యవహరిస్తున్న **సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ / ట్రాక్షన్ / గుంతకల్** వారు దిగువ పనుల కొరకు ఇ-టెండర్లు ఆహ్వానిస్తున్నారు.

టెండరు నెం.: జిటిఎల్ - టిఆర్‌డి - 29 - ఇటిఎన్ - 29 - 2025-26, **పని పేరు : గుంతకల్ డివిజన్:** డబ్ల్యుడి-జిటిఎల్-ఎంఓఓ సెక్షన్‌లో వివిధ ఇన్‌స్టాలేషన్‌నకు ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ (ఎబిఎస్) స్టేషన్ల యొక్క ప్రతి పాదిత ఆక్సిలరీ ట్రాన్స్‌ఫార్మర్లు (ఎటి) కొరకు కేబులింగ్ ఏర్పాటు
సుమారు విలువ: రూ.7,35,16,073/-,
బయానా సొమ్ము ధరావత్తు: రూ. 5,17,600/-.
టెండరు ముగింపు తేదీ & సమయం: 25.07.2025న 15.00 గం.లకు.

టెండరు నెం.: జిటిఎల్ - టిఆర్‌డి - 29 - ఇటిఎన్ - 30 - 2025-26, **పని పేరు : గుంతకల్ డివిజన్:** ఎంఓఓ - ఆర్‌యు సెక్షన్‌లో వివిధ ఇన్‌స్టాలేషన్‌నకు ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ (ఎబిఎస్) స్టేషన్ల యొక్క ప్రతిపాదిత ఆక్సిలరీ ట్రాన్స్‌ఫార్మర్లు (ఎటి) కొరకు కేబులింగ్ ఏర్పాటు
సుమారు విలువ: రూ.6,34,27,757/-,
బయానా సొమ్ము ధరావత్తు: రూ. 4,67,100/-.
ముగింపు తేదీ & సమయం: 28.07.2025న 15.00 గం.లకు.

టెండరు నెం.: జిటిఎల్ - టిఆర్‌డి - 29 - ఇటిఎన్ - 31 - 2025-26, **పని పేరు : గుంతకల్ డివిజన్:** డివిజన్‌లో ట్రాక్షన్ సబ్‌స్టేషన్ మరియు స్విచింగ్ స్టేషన్ల వద్ద గ్రౌంట్రీ ఐసోలేషన్ ఏర్పాటు చేయుట.
సుమారు విలువ: రూ.2,76,27,755/-,
బయానా సొమ్ము ధరావత్తు: రూ. 2,88,100/-.
ముగింపు తేదీ & సమయం: 29.07.2025న 15.00 గం.లకు.

ముగింపు తేదీ & సమయం: 25-07-2025 న, 28-07-2025 & 29-07-2025న 15.00 గం.లకు.

గమనిక: 1. టెండరుదారులు ఉచితంగా www.ireps.gov.in నుండి టెండరు డాక్యుమెంట్‌ను డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.
టెండరు బిడ్డింగ్ మరియు ఇతర వివరాల కొరకు http://www.ireps.gov.in నకు లాగాన్ కండి. ఏదేని సవరణ ఆన్‌లైన్‌లో మాత్రమ